కూరగాయల ధరలకు రెక్కలు

- పండుగ పూట పచ్చడి మెతుకులే గతి
- దళారులు మరింత పెంచి అమ్ముతుండటంపై వినియోగదారుల ఆగ్రహం
- కిలో టమాట రూ.20.. దళారులు అమ్ముతున్నది రూ.25
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు



సి.క్యాంపు రైతుబజారు

కర్నూలు(అగ్రికల్చర్): పండగ పూట కూరగాయల ధరలు కొండెక్కాయి. కర్నూలులోని సి.క్యాంపు రైతుబజారులో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. రైతుబజారులో కూరగాయలు తాజాగా ఉంటాయి.. ధరలు కూడ తక్కువగా ఉంటాయనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఈ అభిప్రాయంతో వెళ్లిన వినియోగదారులకు నిరాశే మిగులుతోంది. బయటి ప్రాంతాలతో పోలిస్తే రైతుబజారులో కూరగాయల ధరలు కాస్త తక్కువే అయినప్పటికీ.. రైతుబజారు నిండా దళారులే ఉండిపోవడం వల్ల బోర్డుపై రాసిన ధరలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇష్టానుసారంగా ధరలు పెంచి అమ్మకాలు సాగిస్తుండటం వల్ల బయటి కంటే ధరలు ఎక్కువే ఉంటున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. దసరా ముంగిట అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగాయి. దళారులు ఈ ధరలను మరింత పెంచేస్తుండటం పట్ల వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దళారులపై మహిళా పోలీసు ఆగ్రహం

రైతుబజారులో దళారుల ఆగడాలు పెరిగిపోవడంతో సి.క్యాంపు రైతుబబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి ఇటీవల 3వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పిర్యాదుపై పోలీసు అధికారులు రైతుబబజారులో డ్యూటీ చేసే విధంగా ఒక మహిళా పోలీసును పంపారు. ఓర్వకల్ మండలం నన్నూరుకు చెందిన చంద్రకళ, చిన్న మద్దిలేటి దంపతులు మార్కెట్ యార్డు నుంచి కూరగాయలు తెచ్చుకొని రైతుబజారులో ఒక స్టాల్‌ను అక్రమించి అమ్మకాలు సాగిస్తున్నారు. టమాట కిలో రూ.20 బోర్డు రేటు ఉండగా వారు మాత్రం కిలో రూ.25 ప్రకారం అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో పలువురు వినియోగదారులు మూకుమ్మడిగా ఎస్టేటు అధికారికి ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న మహిళ పోలీసు సుచరిత, రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివ కుమార్ వెళ్లి ఆ మహిళకు వార్నింగ్ ఇచ్చారు. మరోసారి ఇలాంటి ఫిర్యాదు వస్తే రైతుబజారు నుంచి బయటికి పంపుతామని హెచ్చరించారు. రోజూ ఇలాంటి ఫిర్యాదులు అనేకం ఉంటున్నాయి.

రైతు బజారులో కూరగాయల ధరలు

కూరగాయలు	ధర (కిలో)
టమాట	20
వంకాయ	46/70
బెండ	34
కాకర	28
బీర	36
క్యాలీఫ్లవర్	40
క్యారెట్	46
చెవుల కాయలు	44
చిక్కుడు	30

ధరాఘాతం...

కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు లేకపోవడం వల్ల కూరగాయల సాగు తగ్గింది. అయితే అన్ని ప్రాంతాల్లో ఒకేసారి కూరగాయల దిగుబడి రావడం వల్ల మొన్నటి వరకు ధరలు తక్కువగానే ఉన్నాయి. పండుగ సమయంలో ధరలు పెరగడం, దళారులు మరింత పెంచేయడం వినియోగదారులకు ఆగ్రహం తెప్పించింది. పత్తికొండ, ప్యాపిలి మార్కెట్‌లో టమాట ధరలు పడిపోయి రైతులు అల్లాడుతుంటే కర్నూలు రైతుబజారులో కిలో రూ.20 ప్రకారం అమ్ముతున్నారు. దళారులు ఈ ధరను రూ.25కు పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. టమాట ఒక్కటే కాదు.. వంకాయ, పచ్చి మిర్చి, క్యారెట్, క్యాలీఫ్లవర్, చెవుల కాయలు, బీర ఇలా అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగిపోయాయి. కూరగాయల ధరలు లోకల్ మార్కెట్ కంటే రైతుబజారులోనే ఎక్కువగా ఉండటం పట్ల వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రేపు జంతువధ నిషేధం

కర్నూలు(టౌన్): గాంధీ జయంతి పురస్కరించుకొని ఈ నెల 2న కర్నూలు నగరంలో జంతువధ నిషేధించినట్లు నగరపాలక ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని కబేళాలు, మాంసం దుకాణాల అమ్మకం దారులు తమ షాపులను మూసివేయాలన్నారు. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు మాంసం విక్రయాలు చేపట్టరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడమే కాకుండా వారి ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని పేర్కొన్నారు.

నేడు పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ

కర్నూలు కల్చరల్: తెలుగు భాషా వికాస ఉద్యమం ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం ఉదయం 9.30 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని తెలుగు భాషా వికాస ఉద్యమం అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూర, కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ తెలిపారు. అవోపా చీఫ్ కన్వీనర్ మలిపెద్ది నాగేశ్వరరావు, ఆదిలక్ష్మి దేవి దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవోపా గౌరవ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆవిష్కరిస్తారని వెల్లడించారు.

క్లుప్తంగా

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మీసాల సుమలత

కర్నూలు(సెంట్రల్): శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. మంగళవారం 48వ వార్డు రోజా వీధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు తొలి రాజధానిగా ఉన్న కర్నూలులో హైకోర్టు ఏర్పాటు సముచితమన్నారు. సభ్యులు శేషమ్మ, నారాయణమ్మ, కర్రెమ్మ, చిట్టెమ్మ, లలితమ్మ, రాముడు పాల్గొన్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎక్కడ..?



పెయింటింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నపుడు పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత వర్క్ ఇన్‌స్పెక్టర్‌పై ఉంటుంది. ఆయన ఎక్కడున్నారు. అని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆరా తీశారు. ఆ ఉద్యోగిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని సెంట్రల్ ప్లాజా వద్ద సుందరీకరణ పనుల్లో భాగంగా పెయింటింగ్ పనులను తనిఖీ చేశారు. పనులను పర్యవేక్షణ చేయాల్సిన వర్క్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ, డీఈఈలు బాధ్యత తీసుకోవాలన్నారు.

ఏఆర్ఎస్ఐకి ఘనంగా వీడ్కోలు



రాఘవరెడ్డి దంపతులను సత్కరిస్తున్న రెండో పటాలం అధికారులు

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలంలో ఏఆర్ఎస్ఐగా పనిచేసి పదవీ విరమణ పొందిన రాఘవరెడ్డికి ఘన సత్కారం లభించింది. ఈయన 1983లో ఏపీఎస్పీలో చేరారు. గత మూడేళ్లుగా హెడ్ క్వాటర్‌లో మేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం పదవీ విరమణ పొందడంతో అసిస్టెంట్ కమాండెంట్లు రమణ, రవికిరణ్, మహబూబ్ బాషా డీఎస్పీ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన్ను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పెద్దన్న నాయుడు, కార్యదర్శి హరిశ్చంద్ర నాయుడుతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విజయం



బెల్ట్ పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): మార్షల్ ఆర్ట్స్‌తో వ్యక్తిగతంగా విద్యార్థినీ, విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని, తద్వారా విజయం సాధించవచ్చని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. మంగళవారం స్థానిక కిడ్స్ వరల్డ్‌లో తైక్వాండో బెల్టు పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మార్షల్‌ఆర్ట్స్‌లో యోగా, ధ్యానం, వ్యాయామం ఉన్నాయన్నారు. విద్యార్థి దశలో ఏదో ఒక క్రీడను అభ్యసించాలన్నారు. ఒత్తిడితో కూడిన చదువులకు దూరంగా ఉండాలంటే క్రీడలు దైనందిన జీవితంలో అవసరమన్నారు. అనంతరం విద్యార్థులకు బెల్టు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు కలర్ బెల్టులు ప్రధానం చేశారు. తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాష్టమి పూజలు

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్, మాతృ శక్తి ఆధ్వర్యంలో హరిశ్చంద్ర శరీన్ నగర్ సీతారామాలయంలో మంగళవారం దుర్గాష్టమి, ఆయుధ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఠాగూర్ పాఠశాల అధినేత మంజుల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వీహెచ్‌పీలో యువతుల కోసం దుర్గావాహిని మాతృమూర్తుల కోసం మాతృశక్తి పేరుతో రెండు విభాగాలు ఉన్నాయన్నారు. హిందూ సంస్కృతి సంప్రదాయాల గురించి వివరిస్తూ సమాజ ఐక్యతకు కృషి చేస్తుందన్నారు. సభ్యులు సోమ విజయలక్ష్మి, అశ్విని, మహాలక్ష్మి, ఉమాదేవి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మమ్మేలమ్మా.. దుర్గమ్మ



సాయి మందిరంలో సామూహిక పూజల్లో భక్తులు



సోమిశెట్టి నగర్‌లో..



గీతామందిరంలో మహాకాళిగా..



లలితా పీఠంలో..



చిన్న అమ్మవారి శాలలో..



రాజరాజేశ్వరి ఆలయంలో...



సత్యసాయి మందిరంలో...



వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో..



లలితా పీఠంలో రథోత్సవం



రాజరాజేశ్వరి ఆలయంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



నిమిషాంబ దేవి ఆలయంలో..

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని దుర్గమ్మ, మహాకాళిగా, మహిషాసుర మర్దినిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీ సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రులపై సందేశాలు ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



జమ్మిచెట్టు వద్ద కలశాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయంలో..



కల్లూరు చౌడేశ్వరి దేవి ఆలయంలో...



సాయి సుబ్రహ్మణ్యేశ్వర మందిరంలో...



పెద్ద అమ్మవారి శాలలో...



సప్తగిరి చౌడేశ్వరీ దేవి ఆలయంలో...



చౌడేశ్వరీ దేవి ఆలయంలో...



ఇస్కాన్‌లో శ్రీకృష్ణ బలరాములు

3 నుంచి ఉరుసు

కర్నూలు (అర్బన్): జొహరాపురంలో అక్టోబర్ 3వ తేదీన గంధం, 4న ఉరుసు (తట్టీలు), 5న కిస్తీలు (జియారత్) ఉరుసు మహోత్సవం జరుగుతుందని దర్గా ముతవల్లి సయ్యద్ అల్లా ఉద్దీన్ షరీఫ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. జొహరాపురం ఉరుసును అన్ని మతాల వారు సామరస్యంగా మూడు రోజులు జరుపుకుంటారని చెప్పారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వీరశైవులను ఓబీసీలో చేర్చేందుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): వీరశైవులను ఓబీసీలో చేర్చేందుకు అసెంబ్లీలో తన వంతుగా మాట్లాడతానని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చెప్పారు. వీరశైవ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గుత్తిరోడ్డులోని వీవీఎస్ ఫంక్షన్ హాలులో ప్రతిభా పురస్కారాల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. చదువులో ఉన్నతంగా రాణించిన విద్యార్థులకు, డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు, పోలీస్ శాఖ, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారికి పురస్కారాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే గౌరు చరిత, వీరశైవ లింగాయత్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న మాట్లాడారు. వీరశైవ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.చంద్రశేఖరప్ప, సెక్రటరీ జి.జె.రమేష్, వీరశైవ ఐక్యవేదిక అధ్యక్షుడు మల్లికార్జునప్ప, చంద్రశేఖర్, బసవరాజు, నాగరాజు, జి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● విచ్చలవిడిగా చెట్ల నరికివేత



కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీ వద్ద చెట్టు నరికివేత

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏపుగా పెరిగిన చెట్లను గత కొన్నాళ్లుగా విచ్చలవిడిగా నరికివేస్తున్నారు. ఇప్పటికే పూర్వ క్యాన్సర్ వార్డు వద్ద ఓ పెద్ద వృక్షాన్ని నరికివేయగా తాజాగా ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీ వద్ద ఏపుగా పెరిగిన వేప చెట్టును నరికివేశారు. ఈ వృక్షాలు విద్యుత్ తీగలకు, భవనాలకు ఏ మాత్రం అడ్డుగా లేవు. పైగా వాటి కింద వాహనాలను సైతం పార్కింగ్ చేసేవారు. ఇలాంటి నీడనిచ్చే వృక్షాలను నరికేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. – కర్నూలు(హాస్పిటల్)

మత్స్యకారుల ఆవేదనను హోంమంత్రి అర్థం చేసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసేలా ఏర్పాటయ్యే బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ నిరసనలు చేస్తున్న వారిపై హోం మంత్రి వంగలపూడి అనిత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మత్స్యకారులను స్థానికేతరులంటూ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. పార్టీలకు అతీతంగా 16 రోజులుగా ఆందోళన చేస్తున్న వారిపై అనుచితంగా మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం ప్రజల నిర్ణయం మేరకు బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని కోరారు.

పత్తి రైతులను ఆదుకోవాలి



ఏపీ రైతు సంఘం నాయకులకు పత్తి పంటను చూపిస్తున్న రైతులు

కల్లూరు: పత్తి రైతులకు ఎకరాకు రూ. 30 వేలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం బొల్లవరం గ్రామంలో ఏపీ రైతు సంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే నెలలో పత్తి సాగు చేయడం వల్ల పంట ఏపుగా పెరగడంతో 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతు ఆశపడ్డారని తెలిపారు. అయితే కాయ దశలో ఉండగా వర్షాలు కురవడంతో పూత పడిపోయిందన్నారు. దీంతో కాయ కుళ్లిపోయిందని పేర్కొన్నారు. ఎకరాకు రూ. 30వేలు వరకు పెట్టుబడి ఖర్చులు అయ్యాయన్నారు. వారికి న్యాయం చేయాలన్నారు. సంఘం మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు శేఖర్, లక్ష్మి కాంతరెడ్డి, గోపాల్, నాగేషులు, మస్తాన్, నరేష్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న నాయకులు

కర్నూలు (అర్బన్): కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలోని నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గొర్రెల కాపరి ఎల్ల రాముడు కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, మృతి చెందిన గొర్రెలకు ఒక్కోదానికి రూ.20 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల సహకార సంఘం చైర్మన్ శ్రీనివాసులు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ పర్ల శేఖర్, సీపీఎం నాయకులు, కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కె.రంగస్వామి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్ల రాముడుకు నలుగురు ఆడపిల్లలు ఉన్నారని, కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబం అనాథగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కురువ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దపాడు ధనుంజయ, కురువ కులస్తులు, తదితరులు ఉన్నారు.

మతిస్థిమితం లేని యువతి ఆత్మహత్య

కర్నూలు: స్థానిక బుధవారపేటలో నివాసముంటున్న దేవరపోగు సునీత (24) మతిస్థిమితం సరిగా లేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి రాముడు (బక్క న్న) కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు నలుగురు కుమారులు, ముగ్గురు కూతుర్లు సంతానం. రెండో కూతురైన సునీత కొన్నేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. వైద్యుల వద్ద చికిత్స చేయించినప్పటికీ నయం కాక కొంతకాలంగా ఇంటి దగ్గరే ఉంటోంది. మంగళవారం కుటుంబ సభ్యులంతా కూలీ పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో అడ్డపంచతో సీలింగ్‌కు ఉరి వేసుకుంది. మధ్యాహ్నం 1 గంట సమయంలో కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి ఉరికి వేలాడుతూ కనిపించడంతో ఇరుగుపొరుగు సాయంతో కిందకు దింపి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలిసిన వెంటనే మూడో పట్టణ పోలీసులు కుటుంబ సభ్యులను పిలిపించి విచారణ జరిపారు. మతిస్థిమితం లేకపోవడం వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు తెలిపారు.

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్సు సర్వీసులు

కర్నూలు సిటీ: దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని బట్టి బస్సు సర్వీసులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీకి తగ్గ బస్సులేవీ? అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో ప్రచురించిన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన తరువాత రద్దీ పెరిగిన మాట వాస్తవమేనని, అయితే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అదనపు సర్వీసులు నడుతున్నామన్నారు. సోమవారం రెగ్యులర్ సర్వీసులతో పాటు 22 పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు అదనంగా నడపడం జరిగిందన్నారు. అదే విధంగా బెంగళూరుకు 13, చెన్నై 1, హైదరాబాదుకు 3 ప్రత్యేక బస్సులను ప్రయాణికుల రద్దీని బట్టి నడుపుతున్నామన్నారు.